# కరువొచ్చింది

కరువొచ్చింది.

పంటలు పండినై. గింజలు కళ్ళాలు దాటగానే మాయమయినై. కరువొచ్చింది.

పైరు పచ్చగా పెరిగినప్పుడూ, కంకులు బరువుగా వొంగి తమను ఏపుగా పెంచిన భూదేవికి జోహార్లు చేసినప్పుడూ, బంగారు గింజలు కనక వర్షంలాగా జలజల రాలినప్పుడూ కళ్ళ పండువుగా చూసిన పేద ప్రజలకు కన్ను పొడుచుకున్నా గింజ కనిపించలేదు.

రైతు కూలీల తపఃఫలితాన్ని గద్దలు తన్నుకుపోయినై. కాటకం వచ్చింది.

పేద ప్రజలు అలజడి పడ్డారు. గగ్గోలు పెట్టారు. పళ్ళు పటపట కొరికారు. నోళ్ళు తెరచి మూయటం మరిచిపోయినారు. వాళ్ళ కళ్ళల్లో దైన్యమూ, ఆశా, ఆగ్రహమూ, నిరాశా కనిపించి, ఆఖరకు కళ్ళల్లో ఉన్న దీపం కాస్తా ఆరి కొడిగట్టింది.

చుట్టపు చూపుగా వచ్చిన మృత్యు దేవతకు చక్కని సన్మానం జరగటం వల్ల పోనీ అని ఉండిపోయి తన రాక మూలంగా తెలియజేసింది.

బుద్ధిమంతులంతా చేరి పరిస్థితుల మీద తమ అసమ్మతి తెలియజేయడానికి బహిరంగ సభ చేయాలని తీర్మానించారు. ఇంటింటా పోయి ప్రచారం చేశారు. చదవుకున్న వాళ్ళంతా ఉద్యమాన్ని బలపరచి ఆశీర్వదించారు. కరపత్రాలు పంచి పెట్టబడ్డాయి.

కరువు పోగొట్టడానికి ఒక తాత్కాలిక సంఘం నియమించబడింది. కార్యక్రమమంతా వారి చేతుల్లో ఉంచబడింది. ఈ సంఘం బహిరంగ సభలు ఏర్పాటు చేయడానికి పూనుకొంది. ప్రజలలో ఆశ రేకెత్తింది.

దేశంలో వున్న కవులూ, విజ్ఞానులూ, శాస్త్రవేత్తలూ, సంఘ సంస్కారులూ, బీదవాళ్ళ ప్రతినిధులూ – వేలాది వేలుగా వచ్చి తాత్కాలిక సంఘం చేరారు.

తిండి దొంగలే కరువుకు కారణమని అందరూ ఆమోదించారు. “తిండి దొంగలు నశించాలి!” అనే నినాదం తాత్కాలిక సంఘంలో ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

ఈ ఆందోళన తిండి దొంగలకు నచ్చలేదు. వీళ్ళు రాజకీయ తంత్రాలన్నీ వినియోగపరిచి, కరువు నిర్మూలనోద్యమాన్ని అణచడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. కాని ఈ ఉద్యమం ఆరేదికాదు. దీనికి ప్రజల అండ ఉంది.

ఈ సంగతి గ్రహించి తిండి దొంగలు కొత్త ఎత్తు వేశారు. జిత్తు పారింది. విత్తు మొలిచింది. అది విషపుచెట్టు. దాని విషఫలితాలు మొదటి బహిరంగ సభనాడే బయటపడ్డాయి.

ఈ బహిరంగ సభకు పేద ప్రజలు లక్షలాదిగా వచ్చారు – తమ విమోచన కొరకు జరిగే తీర్మానాలు చెవులారా విందామని.

అధ్యక్షుణ్ణి తాత్కాలిక సంఘ కార్యదర్శి సూచించాడు. మరెవరో ఆమోదించారు. అధ్యక్షుడు లేచి నిలబడి "సోదరులారా! మనం ఇక్కడ ఎందుకు చేరామో మీరంతా ఎరుగుదురు. మనం ఇక్కడ జరపబోయే తీర్మానాలు సమాజం యొక్క శాంతి భద్రతలను పెంపొందించేవిగా ఉండాలి. సర్వేజనా స్సుఖినోభవంతు" అని కూర్చున్నాడు.

ఒక కవిగారు లేచి ఆకలిని తిడుతూ కొన్ని పద్యాలు చదివాడు. మరో కవిగారు లేచి మృత్యువును తిడుతూ మరికొన్ని పద్యాలు చదివాడు. అందరూ హర్షించారు. కాని పేదల ప్రతినిధుల కిందులోని చమత్కారం అవగాహన కాలేదు. ఆకలిని తిట్టడం దేనికి? ఆకలి లేకపోతే ఎట్లా? చావును తిట్టడం మాత్రం దేనికి? మనుష్యులు చావకుండా ఎట్లా?

అయినా వారు శాంతంగా విన్నారు.

ఒక పెద్దమనిషి ఈ విధంగా తీర్మానం ప్రతిపాదించాడు.

"పేద ప్రజలు కరువుతో బాధపడుతున్న మాట నిజం. ఇది భగవంతుడు దేశానికి పెట్టిన విషమ పరీక్ష. పేద ప్రజలు ఈ పరీక్షకు నిలబడాలంటే ఆధ్యాత్మిక బలం సాధించాలి. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో ఉపదేశించినట్టు ద్వంద్వాలను విసర్జించి, పంచతన్మాత్రలకు వశుడుగాక, కూర్మం వలె అంగాలన్నీ ముడుచుకున్నట్టు ముడుచుకుంటే ఎవరినీ బాధించ నేరదు."

ఈ తీర్మానాన్ని బలపరుస్తూ మరో పెద్దమనిషి ఈ విధంగా చెప్పాడు.

"సోదరులారా! మనం ఒక్క విషయం గ్రహించాలి. కరువు కన్నకూడా కరువు భయం మనను కుంగదీస్తుంది. మనస్తత్వవేత్తలీ విషయం రుజువు చేసారు. ఈపాటి కరువుకే ఇంతమంది చచ్చారంటే, వెనకటి మహా ఋషులు కందమూలాలు తినీ, జలభక్షణ చేసీ, వాయు భక్షణ చేసి, అన్నేసి ఏళ్ళు, పుట్టలు పెరిగేలాగా ఎట్లా తపస్సు చేయగలిగారు?.... సోదరులారా మన పేద ప్రజలు కర్మసిద్ధాంతం గుర్తించినవారై, కరువు పరిస్థితులు అర్థం చేసుకున్నవారై, కర్తవ్యం అవగాహన చేసుకున్నవారై, సాధ్యమైనంత తక్కువ ఆహారం మీద – వీలుపడితే గుక్కెడు నీళ్ళుతాగి – కేవలం జీవించి ఉండగలందులకు మాత్రమే భోజనం చేస్తూ – ఇది మంచి ఆరోగ్య సూత్రం, కావలిస్తే వైద్యులను అడగండి!

కరువును ధైర్యంగా ఎదిరించి యింత కన్న ఘోరమైన కరువు వచ్చినా తట్టుకోగలమని రుజువు చేస్తారు... యీ తీర్మానం అందరూ బలపరచవలసిందిగా కోరుతున్నాను."

ఆ తర్వాత క్రమంగా ఈ క్రింది తీర్మానాలు ప్రతిపాదించబడి ఆమోదించబడినై.

1. దేశమంతటా రాంభజనలు జరపాలి.
2. దేశం నడిమధ్య ప్రాంతంలో ఒక ఎకరం మేర హోమగుండం తవ్వి బ్రహ్మాండంగా యజ్ఞం చెయ్యాలి.
3. దేశభక్తులెవరూ పూటకు పావుశేరు బియ్యం కన్న తినకూడదు. (దీన్ని అర్ధశేరుకు పెంచమని తెచ్చిన సవరణ నెగ్గింది).
4. పేద ప్రజలు మృష్టాన్నాలు మానాలి. ఎవరూ అన్నం పారెయ్యరాదు. (ఆ విధంగా పారేసిన అన్నాన్ని మాదాకవళం వాళ్ళకి వెయ్యవచ్చుననే సవరణ ఆమోదించబడింది).
5. పేద ప్రజలు శరీర వ్యాయామం చేసి బలాఢ్యులుగా ఉండాలి.

ఈ విధంగా ఇంకా చిల్లర తీర్మానాలు ఎవరూ అబద్ధం ఆడరాదనీ, తిండి దొరకని పక్షంలో ఆకో అలమో తినాలిగాని నిరసన వ్రతం చేసి చావరాదనీ, సాధ్యమైనంత వరకు అందరూ బ్రహ్మచర్యం అవలంబించాలనీ, మాంసాహారం వర్జించాలనీ, దేశ భక్తులంతా గీతాపారాయణ చెయ్యాలనీ – కూడా జరిగినై.

తీర్మానం అనంతరం కరువు నిర్మూలన మహాసభ (సంవత్సర చందా ఒక అణా, పోషకులకు బేడా, రాజపోషకులకు రూపాయి, యావజ్జీవ సభ్యత్వానికి నూటపదహార్లు) ఒక కార్యవర్గాన్ని ఎన్నుకొంది. అందులో రాజపోషకులూ, యావజ్జీవ సభ్యులూ మాత్రమే ఎన్నుకోబడ్డారు.

పేదవాళ్ళ ప్రతినిధులంతా చేరి వేరే ఒక సభ పెట్టారు. జరిగిన సమావేశాన్ని ఖండించారు. ఇందులో సరి అయిన తీర్మానం ఒకటి కూడా జరగలేదు. కరువు కారణాలు చర్చించలేదు. తిండి దొంగలను ఎదుర్కొనే కార్యక్రమం ఇవ్వబడలేదు. జరిగిన తీర్మానాలలో ఏ ఒకటి కూడా అసలు సమస్య నెదుర్కోలేదు. సరి అయిన తీర్మానాలు కొందరు ప్రతిపాదించగా మహా సభాధ్యక్షుడు వాటిని శాంతి భద్రలతు హానికరంగా ఉన్నాయని తోసేశాడు.

పేదల ప్రతినిధుల సమావేశంలో కొన్ని తీర్మానాలు చేయబడినై.

"తిండి దొంగలను మహాసభ ఎదిరించాలి. శిక్షించాలి. ఆహారపదార్థాలు సంపాదించడానికీ, ప్రజలకు న్యాయంగా పంచడానికీ ఉప సంఘాలు నియమించాలి. ఇందులో ప్రజాప్రతినిధులే ఉండాలి."

ఈ తీర్మానం చూసి మహాసభ కార్యవర్గం మండిపడింది.

"వీళ్ళకేం చెబుతారు? రేపు యజ్ఞం చేయడానికి మోతుబరులు వందలకు వందల పుట్లు ధాన్యం విరాళం ఇస్తున్నారు. తిండిదొంగలు నశించాలి అని మనం అన్నట్టయితే పెద్దవాళ్ళకు కోపం వచ్చేస్తుంది. మనం సామంతో వారి హృదయాలు కరిగించాలి. హృదయాలు కరగగానే దేశం మళ్ళీ సుభిక్షం అవుతుంది.

"అదీగాక, మనలో అంతో ఇంతో ధాన్యం దాచుకున్న వాళ్ళం ఉన్నాం. మనమూ తిండి దొంగలమేనామరి? ఆ మాట అని మనం ధాన్యం బయట పెట్టేస్తే ఎవరి కడుపు నిండుతుంది? మనమూ మన భార్యలూ, బిడ్డలూ మాడడమే కాని మరేమీ జరగదు" అన్నాడు అధ్యక్షుడు.

క్రమంగా మహాసభలో కొన్ని తరగతులేర్పడినై. ఆధ్యాత్మిక వాదులూ, తాత్విక వాదులూ, కార్యవాదులూ, ఎవరికి వారయినారు. కరువుదారిన కరువు చెలరేగుతూనే వుంది.

ప్రజలంతా మహాసభను నమ్ముకుని ఉన్నారు. నిస్పృహా, ఆశా, ఈ రెంటి మధ్య వారు త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. ఉద్యమం ఎంతకాలం సాగినా తిండి దొంగల పని బాగానే వుంది. వారి ప్రతినిధులంతా క్షామ నివారక మహాసభలో ఉన్నారు. క్షామ నివారణకు గాను ఉపసంఘాలు నియమించబడినై. ఉపసంఘాల్లో స్థానాల కోసం కలతలూ, చీలికలూ, పోటీలూ సాగినై.

"ఈ కలతలూ, చీలికలూ, పోటీలూ ఏమిటి?" అన్నారు కొందరు. "రాజకీయ చైతన్యం బాగా సాగుతుందన్నమాట" అన్నారు తెలిసినవాళ్ళు.

పేదవాళ్ళ పరిస్థితి నానాటికీ హేయమైన స్థితికి వచ్చింది. వాళ్ళ ప్రతినిధులు ప్రజల సమైక్య పోరాటం సాగితేనే గాని ఈ క్షామం నివారణ కాదని అలజడి ప్రారంభించారు.

వెంటనే మహాసభ ప్రతినిధులు పేదల ప్రతినిధులు దేశద్రోహులని ప్రచారం ప్రారంభించారు.

దేశంలో కల్లోలం హెచ్చిపోయింది. "ఈ కల్లోలాల కన్నింటికీ కారణం ఎవరు? పేదల ప్రతినిధులమని చెప్పుకుంటూన్న దేశద్రోహులు. వారిని నమ్మకండి. ప్రజలు చాలా మంచివాళ్ళు. వారికి శాంతిభద్రతలు ఇష్టం. క్షామ నివారణార్థం వాళ్ళెన్నాళ్ళయినా త్యాగయుతంగా పస్తులుంటారు. ఈ దేశద్రోహులు వాళ్ళకి తిండి జ్ఞాపకం చేస్తున్నారు. క్షామనివారక సభను పడగొట్టటం వాళ్ళ పనిగా పెట్టుకున్నారు. దేశంలో అశాంతీ, అరాచకమూ విజృంభించి ఆనందించాలని వీళ్ళ దుర్బుద్ధి–" అని మహాసభ ప్రకటించింది.

పేదల ప్రతినిధులు దేశద్రోహులుగా నిర్ణయించబడ్డారు. "మేము మీ వాళ్ళం!

మీరంతా పెద్దలు. మీరు ముందుండి మాకు దారి చూపకపోగా, తిండి దొంగలు ఆడించే ఆటలు ఆడుతున్నారు. ప్రజలు కరువు నెదుర్కొనే కార్యక్రమం ఇవ్వక, మమ్మల్ని వేటాడటం ఒక ఉద్యమంగా చేస్తున్నారు. ఈ విధంగా ప్రజలను మభ్యపెట్టడం ద్రోహం!.... రండి! మనమంతా కలిసి తిండి దొంగల్ని ఎదుర్కొందాం" అన్నారు పేదల ప్రతినిధులు.

వీళ్ల కేకలు ఊరికే పోలేదు. వీటిలో ఉన్న సత్యాన్ని పేద ప్రజలు అర్థం చేసుకున్నారు. క్షామ నిర్మూలనాసక్తి కలవారంతా అర్థం చేసుకున్నారు. మహాసభలో క్షామానికనుకూలంగా ఉన్న ముఠా, చెరువెండితే చేపలు బయటపడ్డట్టు బయటపడసాగారు.

వీళ్ళు తిండి దొంగల ప్రాబల్యం చూసుకుని ప్రజలను ఆఖరుసారి వంచించటానికి విధానాలు తయారుచేశారు.

"దేశద్రోహులు నశించాలి. ధర్మం వర్ధిల్లాలి. దీనపరులకు జై! ధర్మాత్ములకు జై! భూతదయకు జై!"

ఈ నినాదాలతో పేదల ప్రతినిధుల మీదికి మూఢప్రజని రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు. కొంతకాలం అందరికీ మతులు పోయినట్టు కనపడ్డది.

"ఈ అన్యాయంకన్న కరువే బాగుంది. పేదల ప్రతినిధులమని పేరు పెట్టుకుని వీళ్ళంతా సంక్షోభం తెస్తున్నారే!" అని తెలియని విద్యాధికులు వాపోయినారు.

కాని ఇంత సంక్షోభమూ కరువును పారదోలే ప్రయత్నంలో ప్రజలకూ ప్రజా ద్రోహులకూ మధ్య జరిగే సంఘర్షణలో ఏర్పడ్డదని మంద మతులకు కూడా తెలిసిరాసాగింది.

తమను తిండి దొంగలెంత యుక్తిగా వంచించారో కనుక్కున్నారు. మహాసభ వారిలో ప్రజాహితం కోరిన వారంతా క్షామ నివారణోద్యమంలో ప్రజల పక్షంగా నిలిచారు.

"ఇంకా దారుణం రెచ్చిపోతుంది - చూస్తూ వుండండి!" అన్నారు తిండిదొంగల ప్రతినిధులు మారువేషంలో ప్రజల మధ్య తిరుగుతూ. యథార్థానికి అటువంటిదేమీ జరగలేదు.

అకస్మాత్తుగా తిండిదొంగలు మాయమైనారు. చూస్తుండగానే లక్షలకు లక్షల బస్తాల ఆహారధాన్యం నడివీథిలోకి నడిచి రాసాగింది.

కరువు అదృశ్యమయింది. మృత్యుదేవత వెళ్ళివస్తానని కూడా చెప్పకుండా అదృశ్యమయింది.

దేశంలో శాంతిసౌభాగ్యాలు వర్ధిల్లినై.

*మొదటి ముద్రణ : అభ్యుదయ, ఏప్రిల్ 1947*